# చీకట్లో వెలుగు

## వై. రామచంద్రరావు

స్థూలకాయుల్ని చూచి కొందరు నవ్వుతారు, గేలిచేస్తారు, అవమానపరుస్తారు, అసూయపడతారు, అపహాస్యం చేస్తారు. కాని స్థూలకాయులు సాధారణంగా తాము నవ్వుతూ అందరినీ నవ్విస్తూ ఉంటారు. తమల్ని ఇతరులు అవమానపరచినప్పటికీ అది ఆనందకారణంగానే భావించుకొంటారు. అపకారం చేసిన వాళ్ళకి ఉపకారంచేస్తూ ఉంటారు. చూడడానికి నిండుగా ఉన్నట్టే, వాళ్ల మనస్సు కూడా నిండుగా ఉంటుంది. అయితే అందరు స్థూలకాయులూ ఆకారంలో ఆకర్షించలేనట్టే, మనస్సులో మంచివాళ్ళు కాకపోవచ్చు. ఒప్పళ్ళబస్తాలూ, పీపాలూ, తవాబీలు ఉన్నట్టే, మహా వృషభేంద్రులు, మహా గజాసురులూ ఉన్నారు. ముఖ్యంగా స్త్రీలలో స్థూలకాయం కొంత హాస్యహేతువైనా అందానికి అర్హతగానే కనిపిస్తుంది. వీరివల్ల వ్యయప్రయాసలు రెట్టింపు అవడం తప్ప ఏదైనా ఉపకారం ఉంటుందా యని చాలమందికి తోచవచ్చు. ముఖ్యంగా ఏ బస్సులోనో, ప్రయాణం చేసేటప్పుడు వాళ్లు ఆక్రమించే స్థలాన్ని బట్టీ, వాళ్ళెక్కిన వాహనంలో తూగే తూనికనుబట్టీ ఒక్కొక్కసారి ఎదుటివారి విమర్శలకు గురి అవుతూ ఉంటారు. అయితేనేం, వారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొన్ని ఉపకారాలకి కారణభూతులవుతూ వుంటారు.

అలాంటి అవకాశం కావమ్మగారికి కలిగింది. ఆమె నిండయిన మనిషే. గంగా భాగీరథీ సమానురాలయిన ఆ కావమ్మగారు తమ్ముడింట్లోనే ఉంటూ వాడి మంచిచెడ్డలు ఒకకంట కనిపెట్టి చూచిపెడుతున్నారు. అనగా అక్షరాలా ఇల్లు పట్టిన విధవాడపడుచు.

ఆమెకు కొంత ఆస్తి పాస్తులున్నాయి—దానికి తోడు మంచి నిండైన ఆకారం!—తమ్ముడు కామేశ్వరరావు గ్రామకరణం పని చేస్తున్నప్పటికీ ఆమె అంటే హడలే. ఆమాటకొస్తే — ఆ పల్లెటూర్లో అతనన్నమాటేమిటి, ఆమెను చూస్తే అందరికీ హడలే. ఆమె నడిస్తే ఒక చిన్న హిమాలయ పర్వతం కాళ్లు మొలిచి నడిచివస్తున్నట్టు ఉండేది. బ్రాహ్మణవీధినుండి అడ్డత్రోవను నడిచి వచ్చి, ఆమె అగట్లమీదనుంచి కాలువకి వెళ్లి తడిబట్టలతో బుజాన్ని బిందె యెత్తుకొనివస్తూఉంటే నేలంతా అదిరిపోతూ ఉన్నట్టు ఉండేది. ఆమె వీధులోంచి అలాగ వెళ్ళిందంటే, పలుకరించడానికి కూడా ఆడా, మొగా అందరూ భయపడేవారు. అటువంటి కావమ్మగారు ఇలాంటి కష్టంలో చిక్కుకొంటుందని ఎవరు తలుస్తారు? ఇంతకీ ఆనాటి వేళా విశేషం అటువంటిది. ఎన్నడూ ఊరుకదలి వెళ్ళంది తాను 'గూడెం' వెళ్ళింది. అక్కడ మేనల్లుడి కూతురు బారసాల. వాళ్లు ఎంతో బ్రతిమలాడారు, ఆ రాత్రికి ఉండి ఉదయం బయలుదేరి వెళ్లమని. ఇంటిదగ్గర పాడిగేదె. తనకి తప్ప ఎవ్వరికీ పాలివ్వదు. తమ్ముడు దగ్గరికి వెళ్తేనే తన్నుతుంది. ఏమైనా సరే సాయంకాలానికి వెళ్లవలసిందే. ఇంకా గంట ప్రొద్దుఉండగానే బయలుదేరింది బస్సు. కాని త్రోవలో పెంటపాడు సంతవద్ద ఆలస్యం అయింది. మధ్య ఎన్నిచోట్లనో వాళ్లాపుచేశారు. అత్తిలిదగ్గరేమో—ఆ కారు చెడిపోయిందని గంటపైగా పట్టింది దానిని త్రోసి త్రోసి రథం కదిలించడానికి. ఈలోపున చీకటిపడిపోయింది. చివరికి, ఆ బస్సు పిల్లకాలవవంతెన చేరుకొనేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది. ఊరిలో రామకోవెలదగ్గర దిగి తమలోగిలికి నడిచి వెళ్లవచ్చు. కాని అడ్డత్రోవనైతే అందిపుచ్చుకొంటున్నట్టు ఉంటుందని ఆ వంతెన క్రింద కావమ్మగారు దిగిపోయారు.

చీకటి. కన్నూ మిన్నూ ఏకమైపోయింది. అప్పటికప్పుడే ఊరు మాటుమణిగిపోయింది. ఎక్కడా ఏ దీపము లేదు. దూరదూరంగా గ్రుడ్డిదీపాలు కునుకుపాట్లు పడుతున్నాయి. అంతా నిశ్శబ్దం. కావమ్మగారు చేలగట్లమీదనించి నడచివెళ్తూ వుంది. కొంతదూరం వెళ్ళేటప్పటికి ఆ గట్టుమీద దట్టంగా, గడ్డి పరచివుంది. అది శుభ్రంగానే ఉందని ఆమె కాలు వేసింది. ఇంకేముంది? కాస్తా కూస్తా మనిషిగనకనా, ఆ బెందడిలో కాలు కూరుకొనిపోయింది. కాలు తీయబోతే రాదు. అడుసు, మట్టి. గండి కొట్టె ఎందుచేతనో పూడ్చివేశారేమో, చీకటిలో కనబడలేదు. నక్షత్రాల వెలుతురు, అక్కడక్కడ మెరుస్తూ ఉన్న మిణుగురు పురుగుల కాంతీ తప్ప ఆకారు చీకటిలో ఏమీ కనిపించడంలేదు. ఆమెఒక్కక్షణం నిశ్శబ్దంగా ఉండి అరవడం మొదలుపెట్టింది. కుయ్యో మొర్రో అని కేకలు వేస్తోంది. “ఏమర్రోయ్! ఏమర్రోయ్!” అని గొంతుకచించుకొంటోంది. ఎవరూ వినిపించుకోవడంలేదు. పైగా ఆ చుట్టుప్రక్కల ఇళ్లు అంతగాలేవు. దూరంగా రాజుగారి హవేలీ. వారెక్కడో లోపల ఉన్నారు. ఎన్ని కేకలు వేసినా వినిపించవు. చుట్టూ గుడిసెలలో ఉన్న వాళ్ళకి వినిపించవలసింది మరి. వాళ్లు నిద్రలో ఉన్నారో ఏమిటో! కావమ్మగారు అలాగ కంఠం చించుకుంటూ కేకలు వేస్తూనే ఉంది. ఒక్క మనిషీ పైకి రాలేదు. కొంతసేపటికే ఆ త్రోవను మనిషి అలికిడి వినిపించింది. గొల్ల వీరన్న ఊరులో బుఱ్ఱకథ విని వస్తున్నాడు. ఆ మనిషిని చూచి కావమ్మగారు కేక వేసింది. గొల్ల వీరన్న హడిలి గంతువేశాడు. ఈ చీకటిలో తెల్ల చీరకట్టుకుని నిలబడిన మనిషి 'గంగానమ్మ' అనుకున్నాడు. చటుక్కున పరుగెత్తి వెళ్ళి ప్రక్కనున్న గుడిసెలో దూరాడు. అక్కడ కమ్మరి బ్రహ్మలింగం కొడవలికి కక్కులు కోస్తున్నాడు. ఒక చిన్న కుఱ్ఱవాడు కునుకుపాట్లు పడుతూ కొలిమిచక్రం తిప్పుతున్నాడు. అప్పుడే గొల్ల వీరన్న పరుగెత్తుకొనివచ్చి తను చూచిన వింత చెప్పాడు. బ్రహ్మలింగం - పదచూద్దాం అని బయలుదేరి వచ్చాడు.

“నేను దెయ్యాన్నీ గాను భూతాన్నీ గాను కరణంగారి అక్కనిరా! నాయనా! ఈ బందలో కూరుకొని పోయాను. కొంచెం చేయి ఆసరాయిస్తే బయటపడతాను” అని కావమ్మగారు జాలిగా కోరింది. బ్రహ్మలింగం వచ్చాడు. ఏదో ఉపాయం ఆలోచించాలి. కారు కూరుకుపోతే ఇంకో కారతో లాగిస్తారు. రథం కూరుకుపోతే జనం లాగుతారు. మనిషి కూరుకుపోతే! మనుషులు లాగగలరా? బ్రహ్మలింగం చెయ్యి ఆసరాయిచ్చాడు. లాభం లేకపోయింది. కావమ్మగారు అలాగే నిలుచుండి పోయారు. కమ్మరిబ్రహ్మలింగం

ఉపాయశాలి. ఒక గడ్డపార తెచ్చాడు. అది గట్టుమీద పాతేశాడు. ఇదంతా చేస్తూ ఉంటే ఆ కొలిమి చక్రం పిల్లవాడు చిన్న దీపం పట్టుకొని వెలుతురు చూపిస్తున్నాడు. ఆ గడ్డపారకు ఒక తాడు వేసి అది కౌవమ్మకి పట్టుకోమనిచ్చి మరో త్రాడు వేసి, బ్రహ్మలింగమూ, గొల్లవీరన్నా లాగారు. అమ్మయ్య, కౌవమ్మగారు చివరికి బ్రహ్మప్రళయంమీద బయటపడ్డారు.

ఇదంతా దీపంలేని కారణంచేత వచ్చిన కష్టం. "ఈ చీకటి కోణంలో ఏ పుణ్యాత్ములయినా దీపం పెట్టిస్తే బాగుండిపోను" అని బ్రహ్మలింగం ఒక సూచన చేశాడు. అవును, యిలాంటి చోట ఒక దీపం వుండవలసిందే! ముందు ఈ చీకటిలోంచి తాను యింటికి చేరుకోవాలి. తరవాత ఆలోచించవచ్చును. బ్రహ్మలింగం తన కుఱ్ఱవాడిచేత హరికేన్ దీపం యిచ్చి తోడు పంపించాడు.

కౌవమ్మ తాను పడిన పరాభవానికి సిగ్గుపడిపోయింది. అతనిని ఏమనాలో తెలియలేదు. మాటాడకుండా యింటికి వెళ్లిపోయింది. ఇల్లు చేరుకొని ఆ పిల్లవాడి చేతులో అణా పెట్టింది. ఆ పిల్లవాడు వద్దు అన్నాడు. అలాగే తిరిగి వెళ్ళిపోయాడు. కరణంగారు అక్కయ్య వస్తుందని అనుకోలేదు: తొమ్మిది గంటల రాత్రికి వచ్చేటప్పటికి తలవని తలంపుగా అయిన ఆలస్యానికి ఏం అనాలో తెలియలేదు. కౌవమ్మగారు జరిగిన సంగతంతా చెప్పి—"ఇంతమంది పెద్దలుండి, అలాంటిచోట, నలుగురూ మసిలేచోట దీపంలేకుండా చేశారేమిట్రా? తమ్ముడూ" అని అడిగింది. నిద్రకళ్ళతో ఆ కరణం "రాత్రివేళ ఆ దీపం గొడవ యెందుకు? తెల్లవారాక చూసుకొందాంలే" అని అన్నాడు. తాను పొందిన పరాభవం తనచేత చీకట్లో దీపం పెట్టిస్తుందని ఆమె కలలో కూడా అనుకోలేదు. స్థూలకాయంవల్ల పరోక్షమయిన ఉపకారం!

అలాగ ప్రారంభమయింది ఈ దీపం సంగతి. వంతెనదగ్గర పిల్ల కాలవగట్టుపుంతలో దీపం వెయ్యాలనా? మానడమా? వేస్తే ఎవరు వెయ్యాలి? ఎలాంటి దీపం పెట్టాలి? ఇలాంటి అనంతకోటి ప్రశ్నల మధ్య పుంతలో దీపం వస్తుందా, రాదా అనే సమస్య అయింది. అక్కగారు పోరు పెట్టగా పోరు పెట్టగా కరణం కామేశ్వరరావు దీపంసంగతి దర్యాప్తు చేశాడు. [illegible] లెక్కలకీ, కొలతలకీ, పన్నులు వేయించడానికీ, రివిన్యూ తగాదాలకీ, పొలాల పొలిమేరల గొడవలకీ తనకి అధికారం ఉందిగాని వీధిలో దీపంపెట్టే అధికారం కాని, తీయించివేసే అధికారం కాని తనకి లేదు. అది పంచాయితీ బోర్డుది.

ఆ గ్రామంలో వీధుల్లో దీపాలు వెలుగుతూనే ఉంటాయి. పెద్దవీధిలోను, సంతపేటలోను, రామాలయందగ్గర మూడు పెట్రోమాక్సు దీపాలుకూడా పంచాయితీ బోర్డువారు పెట్టించారు. పంచాయితీ ఆఫీసులో ఒక పెద్ద లైటు ఉంచనేవుంది. వీధుల్లో కిరసనాయిలు దీపాలు వెలిగిస్తూ ఉంటారు. "అవి కిరసనాయిలు తాగినంత త్వరగా వెలుతురునిచ్చిన పాపానపోవు," అని మెయిలరు పాపారావు అంటూవుంటాడు. ఇది గాక, బట్టలకొట్టులో ఒకటి, కమిషన్ కొట్టులో ఒకటి పెట్రోమాక్సు దీపాలున్నవి. కాని అవి అన్నిరోజులూ వెలగవు. పంచాయితీ బోర్డువారు పెట్టినవి కూడా కిరసనాయిలు కరువువల్ల వెలిగించడం మానివేసి దరిమిలా మూలబడ్డాయి. అవి మీరు వెలిగించకపోతే మేమైనా వెలిగిస్తామని, ప్రెసిడెంటుగారొకటి, గ్రామమునసబుగారొకటి తీసుకొన్నారు. కాంగ్రెసు నాయకులు వచ్చినప్పుడూ, కలెక్టరుగారు వచ్చినప్పుడూ యీ దీపాలు వెలుగుతూ ఉంటాయి. ఒకొక్కప్పుడు ఎవళ్లింట్లో అయినా కథలకీ కార్యాలకీకూడా ఈ దీపారాధన జరుగుతూ ఉంటుంది. ఏదియేమైనా పంచాయితీ బోర్డు దీపాలలోంచి



"ఇంకొక్కక్షణం ఉంటె బడ్డీ ఎగిరిపోతుంది!"

# ★ చీకట్లో వెలుగు ★

వెలుతురు తీయగలగడం అనేది గొప్ప సమస్యే.

పుంతలో దీపం — పంచాయితీబోర్డు ద్వారా వెలిగించడంఅనేది మరీతీవ్ర సమస్య. ఆ దీపాలు అసలు వెలిగించే ప్రయత్నమే జరగదు. ఒకవేళ వెలిగించే ప్రయత్నంచేసినా ఆ దీపాలు పంచాయితీ బోర్డు సంప్రదాయాలను అనుసరించి తఱచు సహాయనిరాకరణం చేస్తూ ఉంటాయి.

సాధారణంగా స్పిరిటు లేదనీ, వత్తిలేదనీ ఆ దీపాలు వెలిగించడం మానివేస్తారు. కాని ఎలాగోలాగ కృషిచేసి వెలిగిస్తే గప్పుమని మంటలువచ్చి కాంతికిబదులు జ్వాల బయలుదేరుతుంది. ఈ బాధంతా యెందుకూ అని అది ఆర్పివేసేఉంచుతారు. ఇంక మామూలు కిరసనాయిలు దీపాలలో పురుగులూ అవీపడి మంటని మ్రింగివేయడమో వత్తి దిగజార్చడమో, లేక చమురులేకపోవడమో జరుగుతుంది. అందుచేత అవికూడా వెలుగు ప్రసారంచేయడంలో యథాశక్తి సహాయనిరాకరణం చేసి నిరంతరాంధకారంలో ఉండాలనే పంచాయతీ ధర్మసూత్రాన్ని పరిపాలిస్తూనే ఉంటాయి. పంచాయతీ ఆఫీసర్లు, ఇనస్పెక్టర్లు వచ్చినప్పుడు మాత్రం అవి వినయవిధేయతలతో చక్కగా వెలుగుతూ ప్రతినిత్యమూ అంతశ్శుభ్రంగా ఉన్నట్టు అభినయించి శుభాభివందనాలు అందుకొంటూఉంటాయి. పుంతలో పోనీ పొగచూరిన దీపమైనా లేదు. పంచాయతీబోర్డు ఒక దీపాన్ని పెట్టాలంటే తీర్మానంచేయించాలి. శాంక్షన్ కావాలి. టెండర్లు తెప్పించాలి. అది ప్యాస్ చేయించాలి. ఇవన్నీ జరిగేసరికి దీపం రావడానికి కనీసం ఒక సంవత్సరమైనా కాకతప్పదు. ఈ చిక్కులన్నీ కావమ్మగారి కేం తెలుసు? రేపు పండుగలోపున దీపం పెట్టించితీరాలని పట్టుపట్టి కూచుంది మరి!

కరణంగారు తమ శక్తివంచనలేకుండా ప్రయత్నంచేస్తున్నారు. ముందు పంచాయతీ బోర్డు ఆఫీసరుగారిని చూచారు. ఆయన ప్రస్తుతం సొమ్ములేదు, అందుచేత సాధ్యం కాదని తేల్చివేశారు. లోపాయికారీగా గుమాస్తాతో సంప్రదిస్తే బోర్డులో తీర్మానం చేయిస్తే నిమిషాలమీద అవుతుంది అన్నారు. అది అంత సులభమైన కార్యమా మరి? నలుగురైదుగురు సభ్యుల్ని కూడగట్టుకోవాలి. ప్రెసిడెంటుగారిని ఆకట్టుకోవాలి. చాల పెద్ద ప్రయత్నం చెయ్యాలి. ఈ బాధలన్నీ పడలేక కరణంగారు విశ్రమించుకోవాలని తలపెట్టారు. కాని కావమ్మగారు ఏ ముహూర్తాన ఆ బందలో పడిపోయిందో కాని అప్పటినించీ దీపం వేయించి తీరాలి అనే పట్టుబట్టే కూర్చుంది. "ఇదేమంతి బ్రహ్మప్రళయం? కొండని త్రవ్వి యెలుకను బట్టినట్టు? నలభై యాభై రూపాయలు పెట్టే దీపం? రెండు బస్తాల ధాన్యం అమ్మితే వస్తుంది" అని ఆమె చెప్పింది. చెప్పడం సులువుగానే ఉంది. చేయడమో? కరణంగారు మళ్లా సంప్రతించారు. ఖర్చు తాము పెట్టినా గాని దీనికికూడా తీర్మానం అవసరం అని గుమాస్తాగారు చెప్పారు. కరణంగారు దాని పైయెత్తు వెయ్యాలి.

ప్రెసిడెంటుగారిని కలుసుకొన్నారు. అలాగే-అదేమంత ఘనకార్యం అని చెప్పి తీర్మానం అజెండాలో వేయించమని సెలవిచ్చి, మరి నలుగురు సభ్యుల్ని మద్దతుచేయమన్నారు శ్రీవారు. నలుగురూ ఎవరున్నారు; షావుకారు వెంకటరంగంతో కరణంగారు చెప్పారు. ఆయన కర్ర విరగకుండా, పాము చావకుండా ఇందులో మన యెవారమేముంది అంతా అవునంటే నేనూ 'శంకర'వుతాను అన్నాడు.

సావరంగాంధీ అంటారే ఆగావంచా శర్మగారున్నారు. ఆయన గాంధీగారిలాగమూడు మూళ్ల పంచె, అంగవస్త్రం ధరిస్తారు. ఆశ్రమం, ఖద్దరా ఇవన్నీ ఉన్నాయి. రెండుసార్లు కాంగ్రెసు ఉద్యమంలో జెయిలుకి వెళ్ళాడు. కొడుకులు అందరూ ఉద్యోగాలలో ఉన్నారు; కూతుళ్ళందరికీ వివాహాలు చేసివేశాడు; అల్లుళ్లు కూడా మంచి అధికారాలలో ఉన్నారు. ఆయన స్వగ్రామంలో ఆశ్రమం పెట్టుకొని హరిజన సేవ చేస్తూ గవర్నమెంటువారు హరిజనహాస్టలు, ఖాదీ పరిశ్రమలకిస్తూ ఉన్న గ్రాంటులనుభవిస్తూ జీవిస్తున్నారు. ఆయన అభిప్రాయాలు ఎవరికీ నచ్చవు. అందుచేత కాంగ్రెసు కమిటీలలోకీ, వాటిలోకీ ఆయన్ని ఎవరూ చేరనివ్వరు. పంచాయతీ బోర్డు మెంబరు అయ్యాడు. వింతవాదాలు చేస్తూ ఉంటాడాయన. కరణంగారాయన్ని కలుసుకొని పుంతలో దీపంమాట చెప్పగానే ఆయన సరేనన్నాడు. కాలవ చివర కిరస్తానీ పంతులు యేసుదాసునీ, కార్మిక నాయకుడు గురవయ్యనీ కరణంగారు కలుసుకున్నారు. వాళ్ళూ అలాగే అన్నారు.

తీర్మానం, ఎలాగైతేనేంబోర్డు మీటింగులో చర్చకు వచ్చింది. ఆ చర్చలో సావరం గాంధీగావంచా శర్మగారు తీర్మానానికి వ్యతిరేకంగా మాట్లాడారు. "అంధకారం గ్రామజన్మహక్కు. అది పోగొట్టి ఈ కాలపు పెట్రోలుదీపాలు పెట్టడం పొరపాటు. విదేశీ ప్రభుత్వం, బ్రిటిష్ ప్రభుత్వం నేర్పిపెట్టిన వెఱ్ఱివేషాల్లో ఒకటి గాస్ లైటు వెలుతురు కోరడం. పరదాస్యం పోగొట్టుకొన్నా మనం పరాయిఆచారాలను, వ్యవహారాలను తలదాలుస్తున్నాం. మహాత్ముడు చెప్పిన అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకంగా దీపం పెట్టడంవల్ల ఎన్ని పురుగులకు, ఎన్ని ప్రాణులకు ప్రాణనష్టం! పైగా ఆ చుట్టుప్రక్కల దీపం చూచేది ఎవరు? కుక్కలు పిల్లులూ తప్ప రాత్రివేళ జన సంచారం ఉండదు. ఇది వట్టి దండుగ. ఎవరో ఉచితంగా దానమిస్తున్నారు గదా అని యిలాంటి కొఱవిని కొని తెచ్చిపెట్టుకో లేంగదా? సభ్యులారా! వినండి, ఆలోచించండి, ఈ దీపాన్ని, ఈ వెలుతుర్ని ధిక్కరించండి. తమసోమా జ్యోతిర్గమయ - అన్నారు ఉపనిషత్తులలో. మనజాతి సంస్కృతి, మన విజ్ఞానం అంధకారంలో ఉంది; తమస్సులో ఉంది. చీకటిని చుట్టూ ఆవరించనీయండి. అదియింకా దట్టం కానీయండి. మనకి కావలసిన వెలుగు భౌతికమైనది కాదు. అంతర్దృష్టి. చుట్టూ ఆవరించి ఉన్న చీకటిలోనే ఆ మానసిక తేజస్సు గోచరిస్తుంది. చీకటిలో ఉండే ఆ జ్ఞానజ్యోతిని కాంచండి" అన్నాడు. రెండుసారులు జెయిలుకివెళ్లిన గ్రామకాంగ్రెసు సింహం అలాగ మాట్లాడ్తూ ఉంటే బోర్డువారు కాదనలేకపోయారు. పుంతిలో దీపంసంగతి తాత్కాలికంగా వాయిదా వేశారు.

కావమ్మగారంతమాత్రంచేత నిరుత్సాహం పొందలేదు. తమ్ముడు కరణం అయివుండీ యింతపని చేయించలేకపోవడం ఎంత చిన్నతనం అని దెప్పిపొడిచింది. కరణంగారికి తలవంపులుగానే ఉంది. మళ్లీ ప్రయత్నం చెయ్యాలి అనుకొన్నారు.

పుంతలో దీపంసంగతి ఊరంతా ప్రాకిపోయింది. దీపంలేని కారణంచేత ఒకటి రెండు ప్రమాదాలు అవడంచేత దీపం పెట్టవలసిన అవసరం మరికొందరికి తేటతెల్లం అయింది. మొదటిప్రమాదం పంచాయతీబోర్డు మెంబరు వెంకటరంగం భార్య రత్తమ్మ చీకటిలో చిన్న కాలువగట్టుకి వెళ్లి తిరిగివస్తూఉంటే ఒక గుట్టమీద కాలు వేసింది. చీకట్లో కనిపించక గుట్టకి కాలు తగిలి వేలిగోరు పెల్లగించుకొనిపోయింది. ఆ దెబ్బకు దెబ్బ పడిపోనుకోజాలవరకు





నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. దేహము నిశ్శాక్త, విస్మృత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి అ 15.

పి. సి. ఏ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం) పెరిదేపి, (పోష్టు) — నెల్లూరుజిల్లా.

గ్గలేరు. ఆమెకా దీపం ఉండాలనే ఆవశ్యకత ఎక్కువగా కనిపించి భర్తతో గట్టిగా చెప్పిందట! మరొకసారి ఒట్టెలకోట తిమ్మయ్యగారు రాజుగారి హవేలీకి వెళ్లి తిరిగివస్తూ ఉంటే చీకట్లో చూచుకోక ఒక కుప్పమీద కాలు వేశాడు. అది పేడకుప్ప. కాలుజారి పడిపోతే మళ్లా వారంరోజులవరకు లేవలేకపోయాడు.

ఇంకొకసారి రాత్రివేళ బస్సుదిగి వస్తున్న రెడ్డికొడుకులు, మునసబుగారి అల్లుడు చీకట్లో చూచుకోక అక్కడ పడుకొనివున్న గేదెమీద పడ్డారు. ఆ గేదె కొమ్ము విసిరేటప్పటికి గుండెల్లో గీసుకొనిపోయి నానాఅవస్థ పడ్డారు. ఈలాంటి ప్రమాదాలు అప్పుడప్పుడు అందరికీ అనుభవం కావడంమీద, పెద్దలందరూ ఈ పుంతలో దీపం పెట్టడం మంచిదే అని నిశ్చయించారు. తిరిగి పంచాయతీబోర్డు సమావేశంలో తీర్మానం వచ్చేటప్పటికి—ఆ బోర్డు ఆఫీసుముందు ఒక ఇరవైమంది హరిజనులు మహజరు పెట్టారు. అందులో వారేమన్నారంటే, 'దీపం లేనంతసేపు అక్కడ ఆడవాళ్ళకి మరుగుగా ఉంది. ఈ దీపం పెట్టడం అలాంటి మరుగు లేకుండా చేస్తుంది' అని వారి విన్నపం. పంచాయతీబోర్డువారు మళ్లీ ఈ తీర్మానం వాయిదా వేశారు.

కామమ్మగారికి ఇది పెద్ద పరాజయంలాగుంది. ఇంత పలుకుబడి ఉండి, ఇంత పరపతి ఉండి పాడుఊరులో ఒక దీపం పెట్టించలేకపోయానే అని ఆమెకు చింతగా ఉంది. ముల్లుకర్రతో పొడిచినట్టు తమ్ముణ్ణి మళ్ళీ పొడిచింది.

హవేలీలోకి వెళ్ళి పెద్ద రాజుగారితో మాటలాడితేగాని పని జరగదని కరణంగారక్కడకు వెళ్ళారు. రాజుగారు దర్శనం యివ్వడమే అపురూపం అయింది. దీపం సంగతి వచ్చేటప్పటికి సంగతి విని మరోసారి రమ్మని సెలవిచ్చారు. రెండు మూడు వాయిదాలు వేసిన తర్వాత దీపం వేయించడం మంచిదేకాని, దానివల్ల కొన్ని చిక్కులు లేకపోలేదని తేల్చారు. ఆ చిక్కులేమిటో కరణంగారికి అర్థంకాలేదు. నిజం నిలకడమీద తెలిసింది. రాజుగారి హవేలీలో ఉద్దారసుడు గున్నయ్య అని ఉన్నాడు. అతనికన్ని పనులూ తెలుసు. ఆ ఊరికి రౌడీలలో మొనగాడు. ఇటీవల అతడొక కుటీర పరిశ్రమ పెట్టాడు. అది కొలువక్రింద రాజుగారి దూళ్ళపాకలో. ఈ కుటీర పరిశ్రమ లాభసాటిగా దినదిన ప్రవర్ధమానంగా సాగుతూ ఉంది. అక్కడ రాత్రివేళ ఉత్పత్తి అవుతూవున్న అమృతాన్ని చవిచూడడానికి పెద్దలు, చిన్నలూ అంతా జేరుతూ ఉన్నారు. పెద్దరాజుగారికి, ఈ సంగతి తెలిసినా తెలియనట్టు నటిస్తున్నారు. వ్యవహారం సాగిపోతూ ఉంది. కావలిస్తే హవేలీలోకి కూడా సదరు అమృతపానీయం అప్పుడప్పుడు 'సప్లై' అవుతూ ఉంది.

ఇప్పుడు పుంతలో దీపం పెట్టిస్తే, ఆ దూళ్ళపాకమీద - కాదు పానశాలమీద - ప్రకాశవంతమైన కాంతులు పడతాయి. రహస్యమంతా బట్టబయలు అవుతుంది. అందుకోసం దీపం రావడం మంచిది కాదని తేల్చారు. కరణంగారు సంగతి గ్రహించి చిన్నరాజుగారిని ఆశ్రయించారు. పెద్దరాజుగారూ చిన్నరాజుగారూ అన్నదమ్ములు. ఏవో దాయాది కలహాలున్నవి. ఇక్కడ వాలినకాకి అక్కడ వాలడానికి వీలులేదు కావేషాలూ కార్పణ్యాలున్నూ! పుంతలో దీపం సంగతి చెప్పగానే చిన్నరాజుగారు తప్పక పెట్టించాలి అన్నారు. దీపం కరణంగారి అక్కగారు తెప్పించేటట్టూ, దానికి చమురు ఖర్చులు వగైరా చిన్నరాజుగారు పెట్టేటట్టూ నిశ్చయించారు. ఎలాగైతేం కామమ్మగారి సంకల్పం నెరవేరింది. ఖర్చు వారిదే! ఒక కార్తీకదీపం సమయంలో ఈ దీపం వేయించి ఒక ఉత్సవం చేయించారు. దీపం వెలుతురు చూచి - ఆ చుట్టుప్రక్కల వచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ ఎంతో ఆనందంగా భావించి, దీనివల్ల ఎంతఉపకారం జరిగింది అని కామమ్మగారిని అభినందించారు. ఎంత కాంతివంతమైన దీపానికైనా క్రీనీడ లేకుండా ఉంటుందా? అంతటితో దీపం సమస్య తేలిపోలేదు.

ముందు పంచాయతీబోర్డువారిచేత సాకరం గాంధీగారు, పెద్దరాజుగారి ప్రోద్బలం వల్ల అసమ్మతి తెలిపించారు. ఇది జరగడానికి వీలులేదన్నారు. మునసబు కరణాలకి ఇష్టంగానే ఉంది. అందుచేత పోలీసువారిదాకా పోనీయలేదు. పంచాయతీవారి వ్యతిరేకత తప్పలేదు. దీపం వెలుగుతూనే ఉంది. తర్కవితర్కాలూ, సిద్ధాంత రాద్ధాంతాలూ సాగుతున్నాయి.

చీకటివేళ తమపనులు జరుపుకునేవాళ్ళకి కంటకంగా ఉంది. నిశాచరులయిన జారచోరులకి మరీన్ని. దీపానికి ఎదురుగా పాడైపోయిన బైరాగిమఠం ఉంది. అక్కడ ఎప్పుడూ బికారులూ, బిచ్చగాళ్లు అరుగులమీద మూడంకె వేసుకొని అర్ధాకలికడుపులతో పండుకొని ఉండేవారు. లోపలమాత్రం కాశీ అన్నపూర్ణ కావిడితో అన్నం తెచ్చి అది సేవించి చిలుము గొట్టంతో కాలక్షేపం చేసే పాపాలయోగిగారుండేవారు. ఆ ప్రక్కగదిలో ఒక పాడుపడిన లింగాకారం పానవట్టం ఉండేవి. ఇప్పుడు వాళ్ళకి బదులు జూదగాళ్లు చేరారు. పేకాట రాత్రి తెల్లవారులు ఆడేవారు. వాళ్ళకి ఈ దీపంవల్ల యిబ్బంది! ఎదురుగా కాలువగట్టును మరుభూమిగా ఉపయోగించే గ్రామస్థులయిన ఆడవాళ్లకీ, మగవాళ్ళకీ దీపం



# చీకట్లో వెలుగు

వెలుతురు ఆటంకంగా ఉంది. కాపుసారా కాస్తూ పానశాల నడిపిస్తూ ఉన్న గున్నయ్య బృందంమాట చెప్పనక్కరలేదు. వీళ్లందరూ కలిసి యేం చేశారోకాని ఆ దీపాన్ని రాళ్లతో పగలకొట్టి ఆ కాపలా ఉన్న అసిరిగాణ్ణి రెక్కలు విరగకట్టి స్తంభానికి కట్టిపోయారు.

ఇదిజరగటం కరణంగారికి శిరశ్ఛేదం చేసినట్లయింది. బకిరీ యిచ్చి పోలీసు వారినీ, ప్రొహిబిషన్ పోలీసువారినీ కూడా రప్పించారు. కాని ఏంలాభం? ఏమీ దొరకలేదు. ఎత్తుమీద పైయెత్తు వేసి, ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు చేస్తూ ఉన్నారు. మునసబు కరణాల పార్టీ ఒకటి. పంచాయితీ బోర్డువారి పార్టీఒకటి. వీళ్ళ కలహాలతో మళ్ళీ దీపం లేకుండా చేశారు. కాంతమ్మగారికి ఇదేదో లోపంగానే ఉంది. తిరిగి ఎలాగైనా సరే దీపం తెచ్చి పెట్టాలి. ఆడది, తాను ఏంచెయ్యగలదు? గ్రామ కరణం తన తమ్ముడు చెట్టంతవాడుండీ కూడా ఏమీ చెయ్యలేక పోతున్నాడు? ఈ ఊరి వాళ్లు ఎంతకుచ్ఛితులు! నలుగురికి ఉపకారం కలిగే కార్యానికి కూడా ఇంత ప్రతిఘటన కనపరుస్తున్నారు. చీకటిలోంచి వెలుగులోకి తీసుకెళ్తామంటే ఇంకా కారు చీకటిలోకి పోతామంటున్నారు. ఏమిటి వీళ్ళతో ఉపాయం?

ఇక్కడ అందరికీ వీలైనచోట దీపం పెట్టించాలి. ఆ దీపానికి కాపలా ఉండాలి. ఆ కాపలా కాస్తుండేవాడు ప్రతివాది భయంకరుడైన కాలకింకరుడుగా ఉండాలి. కాంతమ్మగారు ఆలోచించారు. చివరికి కమ్మరి బ్రహ్మలింగం సరిఅయిన వాడని తోచి అతనికి కబురు చేసింది. బ్రహ్మలింగం కార్ఖానా కొంచెం దూరంగా జరిపించి అక్కడ ఒక బడ్డీ వేస్తే! బాగానే వుంటుంది. కాని అది బ్రహ్మలింగం వల్ల అవుతుందా? ఊరిలో అందరికీ తలలో నాలుకలాగ మెసలుకోవాలి. ఏ యొక్క పార్టీవారికి గాని శత్రువు కావడానికి వీలులేదు. ఒక కొయ్యబడ్డీ వేసియిస్తాను అక్కడ దీపం పెట్టించే పూచీ మరెవ్వరికయినా యిమ్మన్నాడు, బ్రహ్మలింగం.

ప్రసిద్ధమైన నంజన్‌గూడు పండ్లసాది వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్జన్ గోరోజన మాత్రలు... ,, 0-8-0
బాలక్స్ విరోచనమగుటకు మాత్రలు.. ,, 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1, విజయవాడ.

పంచాయతీ సరిహద్దులో ఎలాగ బడ్డీ కట్టిస్తారో చూద్దాం అని బోర్డుపెద్దలు కనిపెట్టుకుని ఉన్నారు. రోడ్డుకి అవతలివైపు స్థలం పంచాయతీ వారిది కాదు; లోకల్ ఫండులోకి వస్తుంది. కరణంగారేదో సర్వేరాయి జరిపి అది అసలు మినహాయింపు స్థలంలో చేరినట్టు, దానికి హైవేస్ వారికి అద్దెఇచ్చేటట్టు ఒక అద్దెచీటీ వ్రాయించారు. నాలుగు రోజులయ్యేటప్పటికి ఒక బడ్డీ తయారయింది. చుట్టలు, సిగరెట్లు, బీడీలు, సోడాలు, అందమైన సినిమా బొమ్మలు, అటూ ఇటూ కొత్త తెలుగు చిత్రాల తారల పోస్టర్లు దివ్యంగా ఉంది. దానికి కాగితపు పూలతో అలంకారాలుపెట్టి బ్రహ్మలింగం అదొక చిన్న స్వర్గలోకం లాగ తయారు చేశాడు. అంతా బాగానే ఉంది. ఈ కిళ్ళీ కొట్టు యజమాని యెవరు? టెయిలర్ పాపయ్య యాజమాన్యం క్రింద, తన శిష్యుడు సుభాన్ సాహెబుని పంపించాడు. సాహెబూ, అతని మామ, సిపాయి చినపీరూ కలిసి నడపాలనుకొన్నారు. ఒకరోజు మంచి ముహూర్తం చూచి ఆ కిళ్లీకొట్టుకి కరణంగారు పూనుకొని పంచాయతీ ఆఫీసరు గారిచేత ప్రారంభం చేయించారు.

ఇది ముందరి కాళ్లకు బంధాలు వెయ్యడం. దానితో పంచాయతీ బోర్డు దగ్గర నుంచి ఆక్షేపణ లేకపోయింది.

కిళ్ళీకొట్టులో సాహెబులిద్దరిలో ఎవరో ఒకరు ఉంటున్నారు. బస్సులు వచ్చేపోయేవి అక్కడ ఆగి మరీ వెళ్తున్నాయి. రాత్రి వేళ పెట్రోమేక్సు దీపం అఖండంగా వెలుగుతూ ఉంది. దీపానికి తోడు యెప్పుడూ పదిమంది జనంతో సందడిగా ఉంటుంది. ఆ కాలువ గట్టుమీద న్యూసెన్సు చేయడానికి ఎవరయినా వస్తే, సుభాన్ సాహెబు వడిసెలతో రాళ్లు విసరికొట్టేటప్పటికి పరుగో పరుగు! అవంతా శుభ్రముగా తయారయింది. ఇంక పసువులశాలలో కుటీర పరిశ్రమకి అక్కడనుండి ఉద్వాసన చెప్పక తప్పనిసరి అయింది. బైరాగుల మఠములో పేకాటలు నిలిచిపోయాయి. అంతా సవ్యంగా ఉంది.

ఒకరోజు అర్ధరాత్రి; నిస్సలగా ఉన్న కారణంచేత సాయెబు కొట్టులో దీపం పెట్టలేదు బడ్డీమీద సిపాయి చిన్నపీరు పడుకున్నాడు. దూరంగా కమ్మరదుకాణం పని చేస్తూ ఉంది. ఉన్నట్టుండి కొట్టు వెనుక అలికిడి అయింది. చూసేటప్పటికి బడ్డీకింద మంట పెట్టడానికి దూరంగా జానకి తాడు అంటిస్తున్నాడు. ఇంకొకక్షణములో బడ్డీ ఎగిరి చక్కాపోతుంది. సాయెబు చేతిలో కత్తి తీసుకొని ఒక వేటు వేశాడు చటుక్కున జబ్బ తెగి అమ్మయ్యో అని పడ్డాడు.

నిజానికి తాడు అంటుకోలేదు. ఆ మందు పొట్లం తీసి దూరంగా పెట్టి తగలపెట్టాడు సాయెబు. ఆ పడిపోయినవాడు మాల రంగన్న. ఏమిరా, నీకీపోయేకాలం అంటే గున్నయ్య పెట్టమన్నాడని చెప్పాడు. ఈ సాక్ష్యం పుచ్చుకుని కరణంగారు పెద్ద కేసు పెట్టించారు. కక్షలమీద కక్షలు పెరిగిపోతున్నాయి. ఎలాగయినా దీపం నిలబెట్టాలని కొందరు, ఆర్పివెయ్యాలని కొందరు!

చీకటిలో దీపం పెట్టడంచేత నలుగురికి ఉపకారం కావడానికి బదులు, కక్షలూ కావేషాలూ పెరిగిపోతున్నాయి. మునసబు గారికి ఒక ఉపాయం తోచింది. ఆయన కలెక్టరుగారిని రప్పించి ఊరి పరిస్థితులు విన్నవించి-పుంతలో ఎలెక్ట్రిక్ దీపస్తంభం వేయించవలసిందని కోరారు. ఆ ఊరిలో నూరుమందయినా దీపాలు కావాలీ అంటే తప్ప ఎలెక్ట్రిసిటీ యివ్వరు. ఊరులో రాజాగారి పార్టీ వారు ఎలెక్ట్రిసిటీ అక్కర్లేదన్నారు. కాని మునసబుగారు కలెక్టరుగారితోను, ఇంజనీరు గారితోనూ మాటలాడి, ఇక్కడ కనీసం దీపస్తంభమైనా వేయించమన్నారు. మళ్ళీ అర్జీలు! వద్దని కొందరు, కావాలని కొందరు.

ఒక ప్రయాణంలో ఎలెక్ట్రిక్ ఇంజనీరుగారు ఆ దారిని వెళ్తూఉంటే వారి కారు ఒక పెద్ద చెట్టును గుద్దుకోవలసిన ప్రమాదం ఏర్పడింది. కారణం అక్కడ దీపం లేకపోవడమే! చీకటికి ఆ వంతెన క్రింద మలుపులో చెట్లగుబుర్లో ఎన్ని ప్రమాదాలయినా జరగవచ్చు. ఎలెక్ట్రిక్ ఇంజనీరుగారెలాగో తప్పించుకోవడానికి వీలుగా సమయానికి సాయెబూ దీపం వెలిగించింది. ఆ సందె వెలుతురులో కారు మళ్ళించుకున్నాడు. ఇదిచూచి ఆయన తప్పక దీపం వేయించాలని వ్రాసుకొన్నారు. కరణం, మునసబుల ప్రోద్బలం, అధికారుల ప్రోత్సాహం పని చేశాయి ఆ దారినే ప్రక్కనున్న పంచదార మిల్లుకి కరెంటు సప్లయి చేయడంలో, యీ వంతెన వద్ద ఒక దీపస్తంభం పాతివేశారు. జనవరి మాసంలోనే కొత్త కరెంటు వచ్చి దీపాలు వెలిగాయి.

ఆ సమయానికి తన సంకల్పం నెరవేరినందుకు కాంతమ్మగారు అఖండ దీపారాధన చేయించారు ఆ వేళ తాను స్వయంగా చీకట్లో-ఆ బురదలో కూరుకుని పోయింది. కనక యింత జరిగింది కాని లేకపోతే జరిగేనా? నిండైనవాళ్లె ఆకారంలాగే మనస్సుకూడా నిండైనది మరి! ఆమె పట్టిన పట్టు విడువకుండా భగీరథప్రయత్నంలాగా సాధించింది. ★